

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త


## పైలెట్ ప్రాజెక్టు క్రింద మెదక్ జిల్లాకు చోటు

**-జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**సంగారెడ్డి బ్యూరో, నవంబరు 23 ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇండ్ల సర్వే పైలెట్ ప్రాజెక్టు క్రింద మెదక్ జిల్లాకు చోటు కల్పించబడిందని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. శనివారం హవేళి ఘనపూర్ మండల పరిధిలోని లింగసాన్‌పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లసర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో తెలంగాణ రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టు కింద మెదక్, నిజామాబాద్, మహబూబ్ నగర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు ఎంపిక కాబడినట్లు తెలిపారు. పైలెట్ ప్రాజెక్టు కింద మన మెదక్ జిల్లాకు చోటు దక్కడం అభినందనీయమని, ఇందులో హవేళి ఘనపూర్ మండలం లింగసాన్‌పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల యాప్ ద్వారా సర్వే తీరును సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లింగసాన్‌పల్లి గ్రామం, మెదక్ మున్సిపాలిటీలో వార్డ్ నెంబర్5లో ఇందిరమ్మ ఇండ్ల సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు. సర్వే వేగం పెంచాలని, తెలంగాణలో సొంత జాగా ఉండి ఇండ్లు లేని నిరుపేదలకు తొలిదశలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు.

## ప్రజలు మూఢన్మమకాలు నమ్మి మోసపోవద్దు

**కొండపాక, నవంబరు 23, ప్రభాతవార్త:** మూఢనమ్మకాలు నమ్మి ప్రజలు మోసపోవద్దని జనవిజ్ఞాన వేదిక అధ్వర్యంలో మండలస్థాయి చెకుముకి పరీక్ష పోటీలను కొండపాక బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు పిరిక బాలకిషన్ మాట్లాడుతూ మూఢనమ్మకాలు నమ్మి ప్రజలు సమయాన్ని, డబ్బును వృథా చేసుకోవద్దని సూచించారు. ప్రతి ఒక్కరు సైన్స్‌పై అవగహన పెంచుకోవాలని సూచించారు. సైన్స్‌పరంగా రుజువు అయిన దానినే నమ్మి అచరించాలని కోరారు. ఈ పరీక్ష పోటీల్లో మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. నాన్ రెసిడెన్షియల్ విభాగంలో మర్పడ్గ ఉన్నత పాఠశాల ప్రథమ స్థానాన్ని, కొండపాక బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు రెండవ స్థానాన్ని సాధించారు. రెసిడెన్షియల్ విభాగంలో మహాత్మ జ్యోతిబాపూలే బిసి బాలుర పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల విద్యార్థులు ద్వితీయ బహుమతి గెలుపొందినట్లు అయన తెలిపారు. ప్రథమ, ద్వితీయ స్థానం గెలుపొందిన వారికి జిల్లా నాయకుడు దేవయ్య, పాఠశాల హెచ్ఎం సముద్రాల శ్రీనివాస్‌తో కలిసి పార్టిసిపేట్ సర్టిఫికెట్లను, బహుమతులను అందించారు.

## కేతకి ఆలయంలో అదనపు కలెక్టర్ పూజలు



అదనపు కలెక్టర్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

**ఝరాసంగం, నవంబరు 23, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఝరాసంగంలోని పార్వతీదేవి సమేత శ్రీకేతకి సంగమేశ్వరస్వామి ఆలయాన్ని శనివారం జిల్లా అదనపు కలెక్టర్ మాధురి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న అదనపు కలెక్టర్ కుటుంబ సభ్యులను ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలోని అమృత గుండంలో పాదప్రక్షాళన చేసుకుని జలలింగాన్ని దర్శించుకుని ఆలయ గర్భగుడిలో అర్చకులు వేదమంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అదనపు కలెక్టర్ దంపతులను ఆశీర్వచనాలు చేసి తీర్థప్రసాదాలు అందించి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ తిరుమలరావు, ఆర్ఐ రామారావు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేటపై మీ అశీర్వాదం ఉండాలి



మంత్రి కొండా సురేఖను సన్మానిస్తున్న జి.శ్రీనివాస్

**సిద్ధిపేట రూరల్, నవంబరు 23, ప్రభాతవార్త:** పార్టీ కోసం కష్టపడి పని చేసిన సీనియర్ నాయకులకు, కార్యకర్తలకు నామినేటేడ్ పోస్టులో ప్రాధాన్యత ఇవ్వలని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ, అటవీశాఖ, ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖకు విన్నవించినట్లు సిద్ధిపేట పట్టణ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జి.శ్రీనివాస్ తెలిపారు. శనివారం మంత్రి కొండా సురేఖను హైదారాబాద్‌లోని ఆమె స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్ధిపేటకు విచ్చేసి పార్టీ శ్రేణులతో సమావేశం ఏర్పాటుచేసి ఉత్సాహం నింపాలని కోరినట్లు తెలిపారు. పార్టీ శ్రేణులకు అండగా నిలువాలని, అండగా నిలిస్తే మరింత ఉత్సాహంగా పార్టీ పటిష్టత కోసం సైనికుల్లా కదులుతామని వివరించినట్లు పేర్కొన్నారు. సిద్ధిపేటపై మీ ఆశీర్వాదం ఉండాలని విన్నవించినట్లు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవులపల్లి యాదగిరి తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యమైన భోజనం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మనుచౌదరి

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, అండన్‌వాడీలు, గురుకులాలు, మోడల్ స్కూల్స్, కెజిబివి, ప్రభుత్వ దావాఖనాలలో మంచి నాణ్యమైన రుచికరమైన భోజనాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి సంబంధిత శాఖాధికారులను అదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లాలోని విద్యా, సోషల్, ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ వెల్ఫేర్, సివిల్ సప్లై, వైద్యాధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించేలా జిల్లా యంత్రాంగం అప్రమత్తం కావాలన్నారు. జిల్లాలో ఒక్క శాతం క్వాలిటీ కూడా తగ్గొద్దన్నారు. జిల్లాస్థాయిలో ఫుడ్ సేఫ్టీ కమిటీని వేస్తున్నట్లు తెలిపారు. కమిటీ అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో పనిచేస్తుందన్నారు. అన్ని విద్యాసంస్థలలో సరుకులు, బియ్యం, పప్పులు, నూనెలు, ఇతర వంట సరుకులు అన్నీ నాణ్యమైనవి తీసుకోవాలన్నారు. బియ్యంలో ఎలాంటి పురుగులు వచ్చినా తిరిగి పంపించేలా రిజిస్టర్ మెయింటైన్ చేయాలన్నారు. నాణ్యమైన సరుకుల విషయంలో ఎలాంటి రాజీ పడొద్దన్నారు. బియ్యం బస్తాలలో, ఇతర నిత్యావసర సరుకుల్లో ఎలుకలు, బొద్దింకలు, క్రిమికీటకాలు చేరకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి విద్యాసంస్థలో ఆహారం తయారు కాగానే చెక్ చేసి రుచి చూసేందుకు ఒక టెస్టింగ్ అధికారిని నియమించాలన్నారు. కిచెన్ షెడ్, విద్యాసంస్థల ఆవరణలో ఎలాంటి చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు, మురికినీరు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి విద్యాసంస్థలో భోజన మెనూ తప్పకుండా పాటించాలన్నారు. జిల్లాలో ఎక్కడ ఆహారం బాగా లేదని, పిల్లలు అస్వస్థతకు గురయ్యారని ఏ చిన్న వార్త వచ్చినా అధికారులందరిపై కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. విద్యాసంస్థలలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తేవాలని కలెక్టర్ సూచించారు.

## హనుమాన్ ఆలయంలో పూజలు

**నర్సాపూర్, నవంబరు 23, ప్రభాతవార్త:** నర్సాపూర్ పట్టణంలోని బస్టాండ్ హనుమాన్ ఆలయంలో కార్తీకమాస శనివారం పురస్కరించుకొని శ్రీ ప్రసన్నాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు ఆలయపూజారి గౌడిచర్ల హరిప్రసాద్‌శర్మ వేద మంత్రోచ్చరణల మధ్యన సాగింది. ప్రత్యేక పూజలు నియమనిష్ఠలతో భక్తిశ్రద్ధలతో జరిగాయి. ప్రతి శనివారం ఈ ఆలయంలో శ్రీ ప్రసన్నాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేయడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కుమ్మరి సంజీవ్, సదానందం, రేగన్నాయుడు, పాముల రమేష్, వెంకటచారి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు చేపట్టాలి

## -జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 23 ప్రభాతవార్త:** సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు చేపట్టాలని జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాల ప్రిన్సిపల్స్, వార్డెన్స్‌ను జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయం నుండి జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాలు, కేజీబీవీలు, రెసిడెన్షియల్, అర్బన్ రెసిడెన్షియల్ విద్యార్థులకు ఫుడ్ పాయిజింగ్ జరగకుండా నాణ్యమైన ఆహారం అందించే అంశంపై సంబంధిత అన్ని సంక్షేమ వసతి గృహాల జిల్లా అధికారులు, హాస్టల్ వార్డెన్స్, ప్రిన్సిపల్స్‌తో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ వసతి గృహాలకు సరఫరా అవుతున్న బియ్యం, సరుకుల నాణ్యతను పరిశీలించాలని ఆదేశించారు. ముడి సరుకులు నిలువచేసే స్టోర్ రూమ్‌లు ఎంతో పరిశుభ్రంగా ఉంచాలని, వంట పాత్రల క్లీనింగ్‌లో జాగ్రత్తలు తీసుకోవాలని, వంట చేసే సిబ్బంది కూడా పరిశుభ్రంగా ఉండాలని, సబ్బుతో చేతులు, కాళ్లు శుభ్రచుకోవాలని, నాణ్యమైన సన్నబియ్యం, తాజా కూరగాయలతో మెనూ సిద్ధం చేయాలన్నారు. భోజనం సిద్ధం చేసి పాఠశాల వసతి గృహాల విద్యార్థులకు అందించేటప్పుడు తప్పనిసరిగా వంటను టేస్ట్ చేయాలని, ఆ విధంగా చేసిన యెడల ఆహార పదార్థాల నాణ్యత, రుచులు తెలుస్తాయని, ఏమైనా ఆహారం కల్తీ జరిగినా వెంటనే గుర్తించి విద్యార్థులకు ఆహారం వలన ఫుడ్ పాయిజన్ జరగకుండా చర్యలు చేపట్టవచ్చన్నారు. పప్పులు, ఇతర దినుసులు, సరఫరా సామగ్రి నాణ్యతను కచ్చితంగా పాటించాలని తెలిపారు. ఆర్‌వో ప్లాంట్‌ల పనితీరును పరిశీలించాలన్నారు. సురక్షిత మంచి నీరు అందించాలని సూచించారు. వారానికి కనీసం మూడు సార్లు వసతి గృహాలను పరిశీలించాలని స్పష్టం చేశారు. నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వచ్చే మంగళ, బుధవారాలలో వంట చేసే సిబ్బందికి శిక్షణ నిర్వహించాలని, శిక్షణలో పాఠశాలలు, హాస్టల్స్‌లో సన్న బియ్యం, తాజా కూరగాయలతో నాణ్యమైన భోజనం తయారు చేసి పరిశుభ్రతతో విద్యార్థినీ విద్యార్థులకు వడ్డించే విధానం పూర్తిగా అవగాహన చేయాలన్నారు. ప్రతి శుక్రవారం ఫుడ్ విత్ చిల్డ్రన్ కార్యక్రమం నిర్వహించి విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ ఆహార నాణ్యతను పరిశీలించే కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. ఏదేని నాణ్యత లోపించి విద్యార్థులు ఇబ్బందులు పడితే మాత్రం సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అన్ని వసతి గృహాలను మండల ప్రత్యేక అధికారులు తనిఖీలు నిర్వహించి నివేదికలు సేకరించాలని సూచించారు. అంతకు ముందు హైదరాబాదు నుండి చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి అన్ని జిల్లా కలెక్టర్లకు సంక్షేమ వసతి గృహాలకు నాణ్యమైన భోజనం అందించడంపై సెల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సెల్ కాన్ఫరెన్స్‌లో మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ అన్ని సంక్షేమ వసతిగృహాల్లో సమస్యల నివృత్తికి జిల్లా స్థాయిలో టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఇందులో అదనపు కలెక్టర్ నగేష్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రత్యేక అధికారిగా, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, పౌర సరఫరాల శాఖ అధికారి వీరందరూ సమన్వయంతో స్వయంగా సందర్శించి లోటుపాట్లను సవరించే ప్రక్రియ చేపట్టేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి నీలిమ, ఎస్సి సంక్షేమ అధికారి శశికళ, బిసి సంక్షేమ అధికారి నాగరాజు గౌడ్, మైనారిటీ సంక్షేమ అధికారి జెమ్లా నాయక్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి లేకుండా వైద్యం చేస్తే కఠినచర్యలు

**వైద్యాధికారుల హెచ్చరిక**



ల్యాబ్‌ను సీజ్ చేస్తున్న వైద్యాధికారులు

**మిరుదొడ్డి, నవంబరు 23, ప్రభాతవార్త :** అనుతులు లేకుండా వైద్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ప్రోగ్రాం అఫీసర్ డాక్టర్ అనంద్, డిప్యూటి డిఎంఅండ్‌హెచ్‌ఓ రేవతిలు అన్నారు. శనివారం మండల కేంద్రంలో సరైన అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న మల్లికార్జున ప్రైవేటు ఆసుపత్రితో పాటు ప్రైవేటు ల్యాబ్‌ను తనిఖీ చేశారు. ఈసందర్భంగా స్పెషల్ ఆఫీసర్ అనంద్‌బాబు మాట్లాడుతూ కొందరి ఫిర్యాదుల మేరకు మిరుదొడ్డిలో నిర్వహిస్తున్న మల్లికార్జున అసుపత్రిని పక్కనే నిర్వహిస్తున్న ప్రైవేటు ల్యాబ్‌ను అకస్మిక తనిఖీ చేయగా మల్లికార్జున ప్రైవేటు క్లినిక్ నిర్వహిస్తున్న వైద్యులు లేకున్నా సరైన విద్యా అర్హతలు లేకున్నా డిగ్రీలు లేని ప్రైవేటు జనార్దన్ అనే వ్యక్తి వైద్య సేవలు అందించడం సరికాదన్నారు. మల్లికార్జున అసుపత్రి నిర్వహిస్తున్న వైద్యునికి షోకాజ్ నోటీసు ఇచ్చామని స్పందించని యెడల ఆసుపత్రిని సీజ్ చేస్తామన్నారు. పక్కనే ఉన్న ప్రైవేటు ల్యాబ్ నిర్వహిస్తున్న ల్యాబ్ టెక్నిషియన్‌కు సరైన విద్యార్థులు డిగ్రీలు లేవని సర్టిఫికెట్లు రెన్యువల్ చేయలేదని నిర్ధారణ తనిఖీలో తేలడంలో ల్యాబ్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. విద్యా అర్హతలు లేకుండా వైద్య చికిత్సలు అందిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి షమీం సుల్తానా, సిహెచ్‌ఓ లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ అరెస్టు పేరుతో రూ.90 వేల టోకరా

### విచారణ పేరుతో బెదిరించి డబ్బులు వసూలు చేసిన సైబర్ నేరగాళ్లు

### పోలీసులు వీడియో కాల్ చేయరు

### పోలీసుల పేరుతో వచ్చే ఫోన్‌లకు ఎవరూ స్పందించవద్దు: సిఐ కోండ్ర శ్రీనివాస్

**హుస్నాబాద్ రూరల్, నవంబరు 23, ప్రభాతవార్త:** హుస్నాబాద్ పట్టణంలోని ఒక బేకరి నిర్వాహకుడి నుండి సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టు పేరుతో రూ.90వేలు కొట్టేశారు. శనివారం బాధితుడైన బేకరీ నిర్వాహకుడికి వాట్సప్‌లో పోలీస్ వేషంలో ఉన్న ఒక వ్యక్తి ఫోన్ చేశారు. ఫోన్ లిఫ్టు చేసిన బాధితుడిని సైబర్ నేరగాళ్లు మాటల్లో పెట్టి వారు చేసే పని వివరాలు అడిగి తెలుసుకున్నారని, ఒంటరిగా తనతో మాట్లాడాలని కోరగా బాధిత వ్యక్తి ఒక ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడని, తలుపులు వేసుకున్న తర్వాత పక్కన ఎవరూ లేరు కదా అని పూర్తిగా రూం వీడియో చూయించాలని డిమాండ్ చేయగా నిజంగా పోలీసులే ఫోన్ చేశారేమో అనే ఉద్దేశంతో బాధితుడు పూర్తిగా చూపించిన తర్వాత బాధితుడి క్రెడిట్ కార్డుల వివరాలను చెప్పడంతో పాటు తన పేరుతో ఎక్కడి నుండో ఒక పార్సల్ వచ్చిందని, వచ్చిన పార్సిల్‌లో గంజాయి ఉందని, తనపై కేసుకూడా నమోదైందని, ఈ కేసు ప్రస్తుతం కోర్టులో ఉందని వీడియో కాల్‌లో చూపించడంతో పాటు డిమాండ్ చేసినంత డబ్బులు వారికి పంపిస్తే కేసు లేకుండా ఒదిలేస్తామని కోర్టులో జడ్జి వేషంలో ఉన్న మరో నేరగాడితో మాట్లాడించడంతో తనకు, వచ్చిన పార్సల్‌కు ఎలాంటి సంబంధం లేదు అని చెప్పినా వినకుండా అరెస్టు చేస్తాం..బెయిల్ రాకుండా లోపలే ఉంటావ్ అని బెదిరింపులకు దిగడంతో భయాందోళనకు గురైన బాధితుడు తన అకౌంట్‌లో ఉన్న రూ. 90వేలను సైబర్ నేరగాళ్లకు ఫోన్‌పే ద్వారా పంపించి ఏడుస్తుండడంతో గమనించిన తన సహోదరుడు ఏమైందని అడగగా నేను ఎలాంటి తప్పు చేయలేని జరిగిన విషయాన్ని తనకు వివరించాడు. విషయం తెలుసుకున్న తన సహోదరుడు వెంటనే హుస్నాబాద్ పోలీసులకు విషయం చెప్పడంతో సైబర్ క్రైంమ్‌కు కంప్లెయింట్ చేసినట్లు వివరించారు.

**బెదిరింపు ఫోనులకు ఎవరూ స్పందించవద్దు: సిఐ కోండ్ర శ్రీనివాస్**

పోలీస్ యూనిఫాంలో.. పోలీసుల పేరుతో ఎవరూ వీడియో కాల్ చేయరని, ఇలాంటి ఫోన్ కాల్స్‌కు ప్రజలు స్పందించవద్దని హుస్నాబాద్ సిఐ కోండ్ర శ్రీనివాస్ అన్నారు. ఈ మధ్య కాలంలో సామాజిక మాద్యమాలలో పోలీస్ యూనిఫాం వేసుకుని, డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ నేరగాళ్ల డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్నారు.

పోలీసుల పేరుతో ఎవరు ఫోన్ చేసినా ఫోన్‌లో వ్యక్తిగత సమాచారాన్ని అస్సలు చెప్పవద్దని, పోలీస్ ఈడి, ఐటి, సిబిఐ అధికారులు సైతం విచారణ ఫోన్‌లో చేయరని స్పష్టం చేశారు. జరుగుతున్న సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అవగాహన, అప్రమత్తతే సైబర్ నేరాల కట్టడికి మార్గం అన్నారు. సైబర్ నేరాలకు ఎవరు పాల్పడినా వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్ లేదా, 100 లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని 24 గంటలలోపు ఫిర్యాదు చేసిన వారి డబ్బులు వెనక్కి వచ్చే అవకాశం ఉందన్నారు.

# వణుకుతున్న వసతి గృహం విద్యార్థులు

### పేరుకే వసతి గృహం సౌకర్యాల లేమి

### ఎముకలు కొరికే చలిలో చన్నీళ్లతో స్నానాలు

### అలంకారప్రాయంగా సోలార్ వాటర్ హీటర్లు

### చిన్నశంకరంపేటలోని వసతి గృహాల్లోని పరిస్థితి

**చిన్నశంకరంపేట, నవంబరు 23, ప్రభాతవార్త:** చిన్నశంకరంపేట పట్టణంలోని ఎస్టి సంక్షేమ హాస్టల్లో సరైన వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చలికాలం ఆరంభంలో పంపిణీ చేసిన దుప్పట్లు, బ్లాంకెట్లు ఇప్పటివరకు పంపిణీ చేయలేదు. అరకొర వసతులతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా, అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పట్టినట్లుంది. పట్టణంలోని ఎస్టి వసతి గృహంలో ఈ విద్యా సంవత్సరం మొదట్లో సుమారుగా 80 మంది విద్యార్థుల వరకు చేరగా వసతుల లేమి కారణంగా సగానికి సగం మంది విద్యార్థులు వెళ్లిపోయారు. ప్రస్తుతం ఆ సంఖ్య 100 వరకు పడిపోయింది. వార్డెన్ మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని, వారానికి ఒకరోజు మాంసకృత్తులు పెడుతున్నారని పేరుకే చెప్పుకోవడం తప్ప ఇంతవరకు కడుపునిండా పెట్టింది లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. నీళ్ల పప్పు, నీళ్ల చారులతో తినలేక తీవ్ర ఇబ్బం దులు పడుతున్నామని విద్యార్థులు తెలిపారు. ఉదయాన్నే వేడి నీళ్లు కావాలంటే స్వయంగా కట్టెలను తెచ్చి వేడి నీళ్లను పెట్టుకుంటున్నామని అన్నారు. వేడి నీళ్లు కావా లంటే ఉదయం నాలుగు గంటలకే లేచి నీటిని వేడి చేసుకుంటున్నామని, ఒక్కోసారి సమయం సరిపోకపోతే ఎముకలు కొరికే చలిలో చన్నీళ్లే స్నానం చేసి తొందరగా పాఠశాలలకు వెళ్లాల్సి వస్తుందని వారు తెలిపారు. సోలార్ హీటర్ పనిచేయడం లేదని తెలిపారు. ఉదయం విద్యార్థుల హాజరు బయోమెట్రికును ఎఎన్ఎం, సిబ్బంది చేయాల్సి ఉన్నా మేమే స్వయంగా చేసుకుంటున్నామని విద్యార్థులు తెలిపారు. రాత్రి వేళలో వాచ్‌మేన్ ఒక్కడే ఉంటారని, ఒకవేళ జ్వరం వచ్చిన వాచ్‌మేన్ మాత్రమే దిక్కు అని విద్యార్థులు తెలిపారు. వసతి గృహం లోని సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వసతి గృహం రోడ్డుకు అవతలి వైపు ఎంపీడీవో కార్యాలయం, మండల విద్యాధికారి కార్యాలయం, తాసిల్దార్ కార్యాలయం ఉన్నా ఏ ఒక్కరు హాస్టలును తనిఖీ చేసిన దాఖలాలు లేవని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పుడున్న వార్డెన్ ఇటీవల బదిలీపై ఇక్కడికి వచ్చారని విద్యార్థులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని విద్యార్థుల సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.




చిన్నశంకరంపేటలోని ఎస్టి వసతిగృహం



ఒకే బగోనేలో నీళ్లను వేడి చేసుకుంటున్న విద్యార్థులు

## ఉలవలతో సత్యసాయిబాబా భారీ చిత్రం
### దర్శించుకున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి


సత్యసాయిబాబా చిత్రాన్ని దర్శించుకుంటున్న ప్రతాప్‌రెడ్డి

**గజ్వేల్, నవంబరు 23 (ప్రభాతవార్త):** సత్యసాయిబాబా 99వ జయంతి సందర్భంగా గజ్వేల్ సత్యసాయి మందిరంలో శ్రీ రామకోటి భక్త సమాజం అధ్యక్షుడు రామకోటి రామరాజు ఉలవలతో రూపొందించిన భారీ సాయి బాబా చిత్రాన్ని శనివారం బిఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ రామకోటి రామరాజు తనలోఉన్న అద్భుతకళనుఉపయోగించి సత్య సాయి బాబా అద్భుత చిత్రం వేయడం అమోఘమన్నారు. ఎన్నోచిత్రాలను ఎన్నో రకాలుగా భక్తితో చిత్రించి అందరి అభినందనలు అందుకుంటున్న రామ కోటి రామరాజు ధన్యుడని కొనియాడారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎం ఈఓ యెలగందుల సుకేందర్, కన్వీనర్ చెలిమెట వెంకటేశం,కౌన్సిలర్లు గంగిశెట్టి చందన రవీందర్, గుంటుకు రాజు, నవాజ్‌మీరా,శంకరయ్య పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు ప్రయాణమే సురక్షితం
### -ఆర్టీసీ విబివోలు ఆర్‌పి.రెడ్డి, జయేందర్‌రెడ్డి


వికలాంగులకు బస్సు పాస్‌లు అందజేస్తున్న దృశ్యం

**గజ్వేల్‌టౌన్,నవంబరు23ప్రభాతవార్త:** ఆర్టీసీబస్సుప్రయాణం ప్రయాణీ కులకుఎంతో సురక్షితమని ఆర్టీసీ విబివోలు ఆర్‌పి. రెడ్డి, జయే ందర్ రెడ్డిలు అన్నారు. శనివారం గజ్వేల్ మండలం శ్రీగిరిపల్లి గ్రామంలో గజ్వేల్ -ప్రజ్ఞాపూర్ డిపో ఆధ్వర్యంలో వికలాంగులకు ఆర్టీసీ రాయితీ బస్సు పాస్‌లను అందజేశారు.ఈసందర్భంగావారు మాట్లాడుతూ ప్రయాణీకులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆర్టీసీ అన్ని సౌక ర్యాలు కల్పిస్తుందన్నారు. ప్రైవేట్ వాహనాలలో ప్రయాణం కన్నా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం మంచిదన్నారు. అలాగే వివాహాలకు, శుభ కార్యా లకు, శబరిమల యాత్రకు ఆర్టీసీ బస్సులను బుక్ చేసుకోవాలని, ప్రజలు ఆర్టీసీని వినియోగించుకోవాలని సూచించారు.

## డిబిఎఫ్ ఆధ్వర్యంలో రాజ్యాంగ విలువల పరిరక్షణ ప్రచారం
### -డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డిబిఎఫ్ నాయకులు

**గజ్వేల్, నవంబరు 23 ప్రభాతవార్త:** నవంబరు 26 భారత రాజ్యాంగ 75వ దినోత్సవం నుండి జనవరి 26 గణతంత్ర దినోత్సవం వరకు డిబిఎఫ్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ విలువల పరిరక్షణ ప్రచారోద్యమం నిర్వహిస్తున్నట్లు దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణులు తెలిపారు.శనివారం గజ్వేల్ అంబేద్కర్ విగ్రహం వద్ద కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రచారోద్యంలో భాగంగా ప్రతి రోజు భారత రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞ చేద్దామన్నారు. కుల గణన సామాజిక, ఆర్థిక, రాజకీయ సర్వేలో మన కులాన్ని రాయించుకోవాలని, మనమెంత మందిమో మనకంత వాటాకై పోరాడి సామాజిక న్యాయంను సాధించుకుందామన్నారు. భారత రాజ్యా ంగంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, భారత రాజ్యాంగ పుస్తకాలను, అంబేద్కర్ జీవిత చరిత్ర పుస్తకాలను అందించాలని కోరారు. సదస్సులు, సమావేశాలు, పాదయాత్రలుచేసి రాజ్యాంగ విలువలైన స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం, సామాజిక, ఆర్థిక,రాజకీయ న్యాయం, లౌకికవాదం, సామ్యవాదంపై ప్రజలలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దళిత నేతలు బాల్‌నర్సు, చంద్రం, వినోద పాల్గొన్నారు.

## ప్రశాంత్‌ను సన్మానించిన మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్


ప్రశాంత్‌ను శాలువాతో సన్మానిస్తున్న కెసిఆర్

**గజ్వేల్, నవంబరు 23 (ప్రభాతవార్త):** గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని 9వ వార్డుకు బిఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు ఎస్.ప్రశాంత్ నేషనల్ ఫిజికల్లీ ఛాలెంజ్ క్రికెట్ ఆఫ్ ఇండియా తరపున నిర్వహించే ఛాలెంజ్ ట్రోఫీ 2024 టీంకు తెలంగాణరాష్ట్రం నుండి ఎంపికైనందున శనివారం గజ్వేల్ ఎమ్మెల్యే, రాష్ట్రమాజీముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రశాంత్‌ను ఆశీర్వదించి శాలువాతో సన్మానించారు. ఈసందర్భంగా కెసిఆర్ మాట్లాడుతూ దేశందృష్టిని గజ్వేల్ వైపు మళ్ళించే విధంగా క్రికెట్‌లో మంచి ప్రతిభ కనబర్చాలని సూచించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు కళ్యాణ్‌కార్ నర్సింగరావు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే కఠినంగా వ్యవహరిస్తాం
### -అమీన్‌పూర్ మండల తహశీల్దార్ రాధ

**అమీన్‌పూర్, నవంబరు 23 ప్రభాతవార్త:** ప్రభుత్వ భూములను కబ్జా చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని అమీన్‌పూర్ మండల తహశీల్దార్ రాధ అన్నారు. మీడియా వాస్తవాలను ప్రసారం చేయాలని, కబ్జా దారులకు రెవెన్యూ అధికారులు సహకరిస్తున్నారని వార్తా కథనాలను ఆమె తీవ్రంగా ఖండించారు. శనివారం విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆవమె మాట్లాడుతూసంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండల పరిధిలోని సుల్తాన్‌పూర్‌లో సర్వే నెంబర్ 30లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై మీడియాలో వస్తున్న కథనాలపై తహశీల్దార్ రాధ తీవ్రంగా స్పందించారు. వాస్తవాలను వక్రీకరించి కబ్జాలకు రెవెన్యూ అధికారులు సహకరిస్తున్నారని చేస్తున్న ప్రచారాన్ని తహశీల్దార్ రాధ ఖండించారు. సర్వే నంబర్ 30లోని 720ఎకరాల ఇనామ్ భూములలో 250 ఎకరాలకు వోఆర్‌సీ ఉందని,మిగతాఇనామ్ భూమి వ్యవహారం కోర్టులో ఉందని తేల్చిచెప్పారు. సర్వే నంబర్ 30లో కబ్జాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ రాధ హెచ్చరించారు.ఈసమావేశంలో డిప్యూటీ తాహశీల్దార్ ప్రసాద్, ఆర్ఐ రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

# శాస్త్రీయ విజ్ఞానమే దేశ అభివృద్ధికి పునాది

### -ఎస్ఐ శంకర్, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యులు నరేష్

**పెద్ద శంకరంపేట, నవంబరు 23 ప్రభాతవార్త:** శాస్త్రీయ విజ్ఞానం దేశ అభివృద్ధికి పునాది అని ఎస్ఐ శంకర్, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యులు ఉప్పులేటి నరేష్‌లు అన్నారు. జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు అల్లాదుర్గ్ సీఐ రేణుక రెడ్డి ఆధ్వర్యంలో శనివారం పెద్ద శంకరంపేట పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, ప్రభుత్వ మోడల్ స్కూల్‌లలో మహిళల రక్షణ, వ్యక్తిత్వ వికాసం, సైన్స్, మూఢనమ్మకాల నిర్మూలన అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎస్ఐ శంకర్, ఉప్పులేటి నరేష్‌లు హాజరై మాట్లాడుతూ సమాజంలోని మూఢ నమ్మకాలను విద్యార్థులు వదిలిపెట్టి శాస్త్రీయ సమాజ నిర్మాణానికి నడుం బిగించాలని, దొంగ స్వాములు, భూత వైద్యులు ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని ఆర్థికంగా, సామాజికంగా మోసం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మూఢ నమ్మకాలు లేని శాస్త్రీయ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. బాల్య వివాహాలకు విద్యార్థులు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఉప్పులేటి నరేష్ మాంత్రికులు, భూత వైద్యులు మోసం చేసే కుట్రలను సైన్స్ మ్యాజిక్ షో ద్వారా విద్యార్థులకు వాటి వెనుక దాగి ఉన్న రహస్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ విటల్, పోలీస్ సిబ్బంది జ్యోతి, రమేష్, రవి, స్పెషల్ ఆఫీసర్ విజయ, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.


సైన్స్‌మ్యాజిక్ షో ద్వారా మూఢ నమ్మకాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

# క్యాన్సర్ వ్యాధి నివారణే వికాస తరంగణి లక్ష్యం

### -ఉచిత శిబిరంలో అల్లాడి వీరేశం గుప్తా


వికాస తరంగణి ఆధ్వర్యంలో ఉచిత మహిళా శిబిరానికి హాజరైన మహిళలు

**జహీరాబాద్, నవంబరు 23, ప్రభాతవార్త:** మహిళలను పట్టిపీడిస్తున్న క్యాన్సర్ వ్యాధి నివారణే లక్ష్యంగా వికాస తరంగణి సంస్థ ధ్యేయమని జహీరాబాద్ వికాస తరంగణి అధ్యక్షులు అల్లాడి వీరేశం గుప్తా అన్నారు. శనివారం పట్టణంలోని పద్మశాలి భవన్ మార్కండేయ మందిర ఆవరణలో వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మహిళా వైద్య శిబిరాన్ని అల్లాడి వీరేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా అల్లాడి వీరేశం మాట్లా డుతూ చిన్న జీయర్‌స్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వికాస తరంగిణి ఆధ్వ ర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో మహిళ వైద్య శిబిరాలు నిర్వ హిస్తున్నట్లు పేర్కొన్నారు. శిబిరానికి చేరుకున్న 127 మంది మహిళలకు డాక్ట ర్లు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. మహిళను గర్భద్వారము పరిశీలించి ఇన్ఫెక్షన్ ఉన్నట్లయితే ఉచితంగా మందులను అందచేశారన్నారు. క్యాన్సర్ ఉందా లేదా అన పరీక్షలు చేస్తారన్నారు. మహిళ ఆరోగ్య వికాసన కేంద్ర సమన్వయకర్త మాదవి రవీంద్ర డాక్టర్ శోభ, హైద్రాబాద్ ప్రముఖ టైనాకాలజిస్టులతో పాటు పట్టణంలోని మాధవి ఆసుపత్రి ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ ఎంపీ హిమ ఆధ్వర్యంలో జహీరాబాద్ ప్రాంతంలోని ఆయా ప్రాంతాల్లో ఉచిత మహిళ ఆరోగ్య శిబిరాలు నిర్వ హిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగణి గౌరవ అధ్యక్షులు సాయిరెడ్డి విఠల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు,ఆరోగ్య కార్యదర్శి డాక్టర్ శేషు పద్మ నాభం, సభ్యులు దత్తరెడ్డి, పి వెంకట్‌రెడ్డి, నందిని, సునీతరెడ్డి, విజయలక్ష్మి, శ్రీవాణి, గోపాల్, సాయిరెడ్డి విఠల్‌రెడ్డి, వై ప్రభాకర్, గంజి మంజులత, బెజిగం సంధ్య, ఇ హేమశ్రీ, నాచం విశాలక్షి పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి


జూనియర్ కళాశాలను సందర్శించిన ఇంటర్మీడియట్ విద్యాధికారిని మాధవి

**చిన్నశంకరంపేట, నవంబరు 23, ప్రభాతవార్త:** విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఇంటర్మీడియట్ విద్యాధికారి మాధవి అన్నారు. శనివారం నాడు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆమె సందర్శించారు. విద్యార్థులు రాస్తున్న పరీక్షను పరిశీలించి వారికి పలు సూచనలు చేశారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని చదువులో ముందుకు సాగాలని, చదువును కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని అప్పుడే మంచి ఫలితాలు సాధిస్తారని ఆమె తెలిపారు. అనంతరం ఆమెకు కళాశాలప్రిన్సి పాల్ శశిధర్‌కళాశాల సిబ్బంది శాలువాతో ఘనంగా సన్మానించారు.

## చిన్నారిపై వీధి కుక్కల దాడి

**చిన్నశంకరంపేట, నవంబరు 23, ప్రభాతవార్త:**చిన్న శంకరంపేట పట్టణంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వీధి కుక్కల దాడిలో ఓ చిన్నారికి తీవ్ర గాయాలైన ఘటన చిన్న శంకరంపేట పట్టణంలో శనివారం నాడు చోటు చేసుకుంది. పట్టణంలో నివాసముండే సంతోష దీపు అనే మహిళ స్థానికంగా ఉన్న ఓ పరిశ్రమలో పనిచేస్తుంది. పరిశ్రమకు వెళ్లే గ్రామంలో ఇంటికి తాళం వేస్తుండగా ఆమె కుమారుడు చంద్ర ప్రకాష్ ఇంటి ఆవరణలో ఆడుకుంటున్నాడు. ఇదే సమయంలో వీధి కుక్క దాడి చేసి మూడేళ్ల చిన్నారిని తీవ్రంగా గాయపరిచింది. ఆ చిన్నారి చేతికి,కాలికి గాయం కాగా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. చిన్నశంకరంపేట పట్టణంలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని, పిల్లలు కానీ పెద్దలు కానీ ఎక్కడికైనా వెళ్లాలంటే భయం భయంగా వెళ్తున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గ్రామ అధికారులు చొరవ తీసుకొని వీధి కుక్కల విడుదల తప్పించాలని వారు కోరుతున్నారు.

## స్కూల్ బ్యాగ్స్ నోట్ బుక్స్ పంపిణీ


చందంపేటలోని పాఠశాలలో స్కూల్ బ్యాగ్స్ నోట్ పుస్తకాలు పంపిణీ

**చిన్నశంకరంపేట,నవంబరు 23, ప్రభాతవార్త:** మండల పరిధి చందంపేట గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యూత్ ఫర్ సేవా సొసైటీ సభ్యులు రంగంపేట సతీష్ గౌడ్, రంగంపేట శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, నోట్ బుక్స్, పెద్దబాలశిక్ష పుస్తకాలను శనివారం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు వేణుగోపాల్, మరియు ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

## గంజాయి సాగు చేసిన వ్యక్తికి ఐదేళ్ల జైలు

**మునిపల్లి, నవంబరు 23, ప్రభాతవార్త:** వ్యవసాయ భూమిలో సాగవుతున్న పంటలలో అంతర్ పంటగా గంజాయిని సాగు చేసిన వ్యక్తికి 5 సంవత్సరాలు జైలు శిక్షతో పాటు 25వేల రూపాయల జరిమానాను విధిస్తూ శనివారం జిల్లా న్యాయమూర్తి తీర్పు వెలువరించినట్లు ఎక్సైజ్ సిఐ మధుబాబు తెలిపారు. సిఐ మధుబాబు కథనం ప్రకారం... మండల పరిధిలోని పెద్దలోడి గ్రామానికి చెందిన మంగలి వెంకటేశం గంజాయిని సాగు చేశాడన్నారు. గంజాయిని సాగు చేస్తున్నట్లు తెలుసుకుని 6 నవంబరు 2018న ఎక్సైజ్ సిబ్బందితో కలిసి తను దాడులు నిర్వహించి అక్రమంగా సాగు చేస్తున్న 36 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన ఫస్ట్ క్లాస్ అడిషనల్ జిల్లా న్యాయమూర్తి జయంతి గంజాయిని సాగు చేసిన వెంకటేశ్వర్లకు 5 సంవత్సరాల జైలు శిక్ష, 25 వేల రూపాయల జరిమానాను విధిస్తూ తీర్పు చెప్పారన్నారు. గంజాయిని సాగు చేసినా, రవాణా చేసిన చర్యలు తప్పవని సిఐ మధుబాబు హెచ్చరించారు. సిఐ మధుబాబు, ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి కమలహాసన్‌రెడ్డి, హైద్రాబాద్ డిప్యూటీ కమీషనర్ కేఏబి శాస్త్రిలు అభినందించారు.

## మీ భవిష్యతు మీ చేతులోనే ఉంది : సిఐ పవన్‌కుమార్‌రెడ్డి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిఐ పవన్‌కుమార్‌రెడ్డి

**హుస్నాబాద్‌రూరల్, నవంబరు23, ప్రభాతవార్త:** విద్యార్థుల భవిష్యత్తు వారి చేతుల్లోనే ఉంటుందని ప్రొహిబిషన్,ఎక్సైజ్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం రోజున హుస్నాబాద్‌లోని మోడల్ స్కూల (ఆదర్శ పాఠశాల),పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల జరిగే అనర్థాలను గురించి వివరించారు.మత్తులో మనిషి నేరాలకు పాల్పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు.ప్రతీ విద్యార్థి చెడు వ్యసనాలకు లోనవకుండా కష్టపడి చదివి కన్న తల్లి తండ్రులను,విద్యాబుద్దులు నేర్పించిన గురువులకు చదువుకున్న విద్యాలయాలకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ దామోదర్,మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ విశ్వనాథ్,పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్‌తో పాటు ఉన్నారు.

## 500 మంది విద్యార్థులకు ఉచిత దంత వైద్య పరీక్షలు



విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

**హుస్నాబాద్‌టౌన్, నవంబరు23, ప్రభాతవార్త :** తెలంగాణ గిరిజన గురుకుల సంక్షేమ ప్రతిభా కళాశాలలో శనివారం రోజున శ్రీనివాస సూపర్ స్పెషాలిటీ దంతవైద్యశాల ఆధ్వర్యంలో విద్యార్థులు దాదాపు 500ల మందికి ఉచితంగా దంత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులకు ఉచితంగా వైద్యంతో పాటు మందులు పంపిణీ చేసిన ఆసుపత్రి నిర్వాహకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.ఈకార్యక్రమంలో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్,డాక్టర్ ఎల్ శ్రీనివాస్‌నాయక్, డాక్టర్ సాహితి,సాయిృష్ణతో పాటు ఉన్నారు.

## మాలల మహాపాదయాత్రలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి కుటుంబం


రాష్ట్రప్రధానకార్యదర్శి కుటుంబాన్ని అభినందిస్తున్న సుధాకర్

**హుస్నాబాద్‌రూరల్, నవంబరు23, ప్రభాతవార్త :** జాతీయమాల మహానాడు ఆధ్వర్యంలో ఎస్సి వర్గీకరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న మాలల మహా పాదయాత్ర శనివారం రోజున సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలానికి చేరుకున్న నేపథ్యంలో ఈ మహా పాదయాత్రలో హుస్నాబాద్ మండలంలోని మాలపల్లి గ్రామానికి చెందిన జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న రాజు తన కుటుంబ సభ్యులతో సహా హాజరై యాత్రలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా 1000 కిలో మీటర్లు యాత్ర నిర్వహిస్తున్న నాయకులకు తనవంతు సహకారంగా రాజు కూతురు వెన్న నిఖిల రూ 5వేల విరాళంగా అందజేశారు.కుటుంబ సభ్యులతో యాత్రలో పాల్గొన్నరాజును రాష్ట్రఅధ్యక్షులు పిల్లి సుధాకర్ ప్రత్యేకంగా అభి నందించారు. ఈయాత్రలో సంఘం కార్యదర్శి మేడి అంజయ్య,బుట్టి సత్యనారాయణ,రాష్ట్ర పోలిట్‌బ్యూరోచైర్మెన్ శ్రీరాములు, నాయకులు సత్య నారా యణ, పురుషోత్తం, రాష్ట్రమాల సాంస్కృతిక కన్వీనర్ఎలుక దేవయ్య, హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ ఆరే కిషోర్, మీడియా సెల్ కన్వీనర్ జాల శ్రీనివాస్,యాదగిరి,స్వామితో పాటు పాల్గొన్నారు.

## రికార్డులు పరిశీలించిన రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి


ఎన్నికల రికార్డులు పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

**జోగిపేట, నవంబరు23, ప్రభాతవార్త:** రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి శనివారం నాడు అందోలు ఆర్డీవో కార్యాలయాన్ని తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతితో కలిసి ఆయన ఎన్నికలకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు.ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన వివరాలతో పాటు ఎన్నికల ప్రక్రియకు చెందిన పలు రికార్డులను ఆయన పరిశీలించారు. వివరాలన్నీ సమగ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఆర్డీవో పాండును అడిగి వివరాలు తెలుసుకున్నారు. అంతకుముందు చౌటకూరు మండల పరిధిలోని శివంపేటలో పోలింగ్‌బూతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వెంబడి అందోలు డిప్యూటి తహశీల్దారు మధుకర్‌రెడ్డి ఉన్నారు.

## అంగన్వాడీ కేంద్రాలలో ఆట పాటలతో విద్యాబోధన
### ఎర్లీ చైల్డ్ హుడ్‌కేర్ అండ్ ఎడ్యుకేషన్ డే లో పాల్గొన్న సూపర్వైజర్ సంతోష


ఫోటో రైట్ అప్:అంగన్వాడి కేంద్రంలో మాట్లాడుతున్న సూపర్వైజర్ సంతోష

**శివ్వంపేట, నవంబరు 23 ప్రభాతవార్త :** అంగన్వాడి కేంద్రాలలో పిల్లలకు ఆటపాటల ద్వారా విద్యాబోధనచేస్తున్నామని ఐసిడిఎస్ మండల సూపర్వైజర్ సంతోష్ అన్నారు.శనివారం మండలంలోని గుండ్లపల్లి అంగన్వాడీ కేంద్రంలో ఈసీసీఈ ఎర్లీ చైల్డ్ హుడ్‌కేర్ అండ్ ఎడ్యుకేషన్ డే లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెల నాలుగో శని వారం అన్ని అంగన్వాడి కేంద్రాలలో ఈసీసీఈ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నెలరోజులపాటు అంగన్వాడి కేంద్రాలలో పిల్లలకు నేర్పిన ఆటలు పాటలు కథలకు సంబంధించి ప్రగతి నివేదికను తల్లిదండ్రులకు వివరించడం జరుగుతుందని ఆమె అన్నారు. అంగన్వాడి కేంద్రాలలో గర్భిణీలు ,బాలింతలు, పిల్లలకు, పౌష్టికఆహారం,పాలు, కోడిగుడ్లు, ఇస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, పిల్లలు పాల్గొన్నారు.

## మహారాష్ట్ర ఎన్నికల్లో బిజెపి గెలుపు పట్ల హర్షం
### -మండల బిజెపి అధ్యక్షుడు కోణం విఠల్


మిఠాయిలు తినిపించుకుంటున్న బిజెపి నాయకులు, కార్యకర్తలు

**పెద్దశంకరంపేట, నవంబరు23 ప్రభాతవార్త:** మహారాష్ట్ర ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అత్యధిక మెజార్టీతో గెలుపొందడం పట్ల పెద్ద శంకరంపేట మండల బీజేపీ అధ్యక్షుడు కోణం విఠల్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం పెద్ద శంకరంపేటలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయం వద్ద బిజెపి నాయకులు, కార్యకర్తలు మహారాష్ట్రలోగెలుపొందడంతో బాణసంచా కాల్చి మిఠాయిలు తినిపించుకున్నారు. బిజెపి కూటమితోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.దేశవ్యాప్తంగా జరిగిన ఉప ఎన్నికల్లో భారతీయజనతాపార్టీకి మంచి ఫలితాలు సాధించడం జరిగింద న్నారు. కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శులు బందల శ్రావణ్ కుమార్, మంగలి కృష్ణ,బిజెపి నాయకులు, ఎర్ర శ్రీహరి, అంజన్న, రాజు, సాయికుమార్, భూమేశ్వర్, వెంకయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి

**పెద్ద శంకరంపేట్, నవంబరు 23 ప్రభాతవార్త:** పెద్ద శంకరంపేట మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి శనివారం అందజేశారు. పెద్ద శంకరంపేట మండల పరిధిలోని జూకల్ గ్రామానికి చెందిన అనసూజకు 33 వేల రూపాయలు, రామోజీ పల్లి గ్రామానికి చెందిన చిరంజీవికి 25 వేల రూపాయల విలువ చేసే చెక్కులను మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, దత్తు, సురేష్ గౌడ్, వెంకట్ రెడ్డి, యాదుల్, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులపై సూపర్‌వైజర్‌ల ఒత్తిడి తగదు
### -మెదక్ జిల్లా పిఆర్టీయూటిఎస్ అధ్యక్షులు సుంకరి కృష్ణ

**మెదక్ మున్సిపాలిటీ, నవంబరు 23 ప్రభాతవార్త:** సర్వే డ్యూటీ పూర్తి చేసిన ఉపాధ్యాయులను తిరిగి డాటాను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయించాలని సర్వే సూపర్‌వైజర్లు ఉపాధ్యాయులను ఆఫీసులకు రమ్మని పిలవడం తగదని మెదక్ జిల్లా పీఆర్టీయూ టీఎస్ అధ్యక్షులు సుంకరి కృష్ణ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ శుక్రవారం రాత్రి తమకు స్పష్టంగా డీఈఓ నుంచి సమాచారం చేరవేయబడిందని, జిల్లా విద్యాధికారి రాధాకిషన్ ద్వారా సర్వే పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు పాఠశాలలకు వెళ్లాలని, ఆన్‌లైన్ బాధ్యత ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌దే అని తేల్చి చెప్పారు. సూపర్‌వైజర్‌లు పై అధికారుల నుంచి సమాచారం తీసుకోవాలి కానీ, ఈ విధంగా ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేయడం తగదని సుంకరి కృష్ణ తెలిపారు.

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ


చెక్కులను అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**చిన్నశంకరంపేట నవంబర్ 23, ప్రభాత వార్త:**మండలపరిధి సూరారం గ్రామానికి చెందిన కరణం చంద్రయ్య కూతురు రాధిక అనారోగ్య కారణంగా ఆస్పత్రి లో చికిత్స చేయించుకుని సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకుంది. మంజూరైన 60వేల రూపాయల సీఎం సహాయ నిధి చెక్కును మండల యూత్ నాయకుడు రాజ్‌కుమార్ గౌడ్ శనివారం వారి కుటుంబ సభ్యులకు అందించారు.

## నేటి దూడలే రేపటి పాడి పశువులు



పశువైద్య శిబిరంలో పశువులకు చికిత్సలు చేస్తున్న డాక్టర్ గణేష్

**న్యాల్‌కల్, నవంబరు 23, ప్రభాతవార్త:** రైతులు తాము సాకుతున్న పశువులతో పాటు దూడల పోషణ పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని న్యాల్‌కల్ పశువైద్యాధికారి గణేష్ అన్నారు. శనివారం మండల పరిధిలోని టేకూర్ గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి రైతులు తీసుకువచ్చిన పశువులకు చికిత్సలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గణేష్ మాట్లాడుతూ దూడలను జాగ్రత్తగా చూసుకుంటే రేపు అవే పాడి పశువులుగా కుటుంబానికి ఆర్థిక అవసరాలు తీరుస్తాయన్నారు. దూడల ఆరోగ్యంపై రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పశువుల్లో గర్భస్థ వ్యాధుల వల్ల పాడి రైతులు నష్టపోతున్నారని గుర్తు చేశారు. గ్రామాల్లో నిర్వహించే వైద్యశిబిరాలను ప్రతి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గోపాలమిత్ర సూపర్‌వైజర్ తుక్కారెడ్డి మాట్లాడుతూ లింగ నిర్ధారణ టీకాల గురించి రైతులకు వివరించారు. గోపాలమిత్ర సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మేలుజాతి పశు సంపద పెంచాలని అందుకు గోపాలమిత్ర సూచనలు పాటించాలన్నారు. వైద్యశిబిరంలో 9 పశువులకు గర్భనిర్ధారణ పరీక్షలు, 9 పశువులకు సాధారణ చికిత్సలు, 3 పశువులకు గర్భధారణ టీకాలు, 24 దూడలకు నట్టల నివారణ మందులు వేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జెవిఓ కిషన్‌రావు, ఓఎస్ మజీద్, మాజీ సర్పంచ్ ఎండి అమీర్, గోపాలమిత్రలు ధన్‌రాజ్, జనార్ధన్‌రెడ్డి, నాగప్ప, పాడి రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులను అభినందించిన డిఈఓ



సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులను అభినందిస్తున్న డిఈఓ వెంకటేశ్వర్లు

**ఝరాసంగం, నవంబరు 23, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో కొనసాగుతున్న జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొన్న మండల విద్యార్థులను డిఈఓ వెంకటేశ్వర్లు అభినందించారు. మండల పరిధిలోని ఎల్గోయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శశికాంత్, చరణ్ తేజ, శిరీష, మహేశ్వరిలు ప్రదర్శించిన ప్రయోగాలను డిఈఓ పరిశీలించారు. పాఠశాలలో విద్యను అందుకుంటున్న లావణ్య, నిఖిత బృందం విద్యార్థులు ప్రదర్శించిన ఆటపాటలకు డిఈఓ మంత్ర ముగ్దులయ్యారు. పాఠశాల విద్యార్థులను డిఈఓ ప్రత్యేకంగా అభినందించి కీప్ ఇట్ అప్ అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.నాగేశ్వర్, కోహీర్ మండల విద్యాధికారి జాకీర్ హుస్సేన్, ఉపాధ్యాయులు అశోక్, రామకృష్ణ, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## హ్యాట్రిక్ పంతం బిజెపి సొంతం

**సిర్గాపూర్, నవంబరు 23, ప్రభాతవార్త:** హ్యాట్రిక్ పంతం అది బిజెపికే సొంతం అని బిజెపి నాయకులు అరుణ్‌రాజ్ శేరికార్ అన్నారు. మహారాష్ట్రలో బిజెపి జెండా ఎగరేయడం ఇందుకు నిదర్శమన్నారు. భారతదేశ ప్రజల ఐక్యతను చాటే విజయంగా దీనిని అభివర్ణించారు.

## రైతు ముంగిట్లో పశు వైద్యసేవలు



బర్దీపూర్‌లో పశువులకు చికిత్సలు అందచేస్తున్న పశువైద్యాధికారి

**ఝరాసంగం, నవంబరు 23, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బర్దీపూర్ గ్రామంలో శనివారం పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ, డిడిఎస్, కృషి విజ్ఞాన కేంద్రం వారి ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరానికి చేరుకున్న పశువులకు పశు వైద్యాధికారి హర్షవర్ధన్‌రెడ్డి గర్భకోశ చికిత్సలు, సాధారణ చికిత్సలు, కృత్రిమ గర్భ ధారణ, దూడలకు నట్టల నివారణ టీకాలు అందచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పశువులు రోగాల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. రైతులు గోపాలమిత్ర సేవలను వినియోగించుకోవాలన్నారు. పశువులకు పోషకాలు గల మేత, దాణ, మినరల్ మిక్చర్‌ను అందించాలన్నారు. ఈ సందర్భంగా పాడి రైతులకు మినరల్ మిక్చర్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్ అర్జునయ్య, ఓఎస్ శంకర్, గోపాల మిత్రలు అశోక, శ్రీకాంత్, పాడి రైతులు పాల్గొన్నారు.

## చౌటకూరు పాఠశాలలో స్వచ్ఛత పక్వాడ




స్వామి వివేకానంద విగ్రహం వద్ద ఎన్‌సిసి విద్యార్థులు

**చౌటకూరు, నవంబరు 23, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన చౌటకూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఎన్సిసి క్యారెట్స్, ఎన్సిసి అధికారి భాస్కర్ ఆధ్వర్యంలో స్వచ్ఛత పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని గ్రామంలోని అంబేద్కర్, స్వామి వివేకానంద విగ్రహాలను నీటితో శుభ్రం చేసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి అధికారి భాస్కర్ మాట్లాడుతూ ఎన్‌సిసి దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. గ్రామంలో నిత్యం ఒక్కో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# లీకేజీలకు చిరునామా చౌటకూరు పంచాయతి



చౌటకూరులో అపరిశుభ్రంగా ఉన్న వార్డు దృశ్యం

**చౌటకూరు, నవంబరు 23, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన చౌటకూరు లీకేజీలకు చిరునామాగా గుర్తింపు పొందింది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యమో, ఆపరేటల్ అలక్ష్యమో తెలియదు కాని గ్రామంలో ఒక చోట లీకేజిని రిపేరు చేస్తే మరో చోట లీకేజి అవుతోంది. ఏదో ఒక చోటే అనుకుంటూ పప్పులో కాలేసినట్లే, గ్రామంలోని అనేక ప్రాంతాల్లో ఇదే సమస్యలతో గ్రామస్థులు సతమతమవుతున్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో మిషన్ భగీరథనీటి సరఫరా కోసం కాంట్రాక్ట్ పద్ధతి ద్వారా పైప్‌లైన్‌ను గ్రామాల్లో వేయించారు. వేసిన పైప్‌లైన్ నాసిరకం కావడంతో లీకేజీలు అవుతున్నాయా లేదా ఆపరేటర్ నీరు వదిలే సమయంలో ఏదైనా జరుగుతోందా అన్న అనుమానాలను గ్రామస్థులు వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఏదో ఒక చోట పైప్‌లైన్ లీకేజి అవుతుండటంతో తాగునీరు వృధాగా రోడ్డు మీద పారుతుండటంతో ఆ ప్రాంతం బురదమయంగా మారి రాకపోకలకు ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. లీకేజీల నియంత్రణ శాశ్వత నిర్వహణకు ఏం చేయాలో తెలియక పంచాయతీ కార్యదర్శి తలపట్టుకుంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నాణ్యమైన పైప్‌లైన్‌ను అమర్చితే లీకేజీ సమస్య తొలగిపోతుందని, అందుకు కొత్త పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయాలని గ్రామస్థులు అందరూ సూచిస్తున్నారు.

## డేటా ఆపరేటర్లకు ఎంపిడిఓ సూచనలు



నాగల్‌గిద్దలో డాటా ఆపరేటర్లకు సూచనలు చేస్తున్న ఎంపిడిఓ

**నాగల్‌గిద్ద, నవంబరు 23, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన నాగల్ గిద్దలోని మండల పరిషత్ కార్యాలయంలో కొనసాగుతున్న ప్రజాపాలన ఆన్‌లైన్ ధరఖాస్తులను అప్‌లోడ్ చేసేందుకు 20 మంది కంప్యూటర్ ఆపరేటర్లను నియమించి వారికి ఎంపిడిఓ మహేశ్వర్‌రావు శనివారం శిక్షణ ఇచ్చారు. డేటా ఎంట్రీకి ఈ పాటికే 120 వరకు ధరఖాస్తులను ఎంట్రీ చేయడం పూర్తయిందన్నారు. తప్పులు దొర్లకుండా ఎంట్రీ చేయాలని ఆపరేటర్లకు ఎంపిడిఓ సూచించారు.

## షాట్ సర్క్యూట్‌తో ఆస్తి నష్టం



షాట్ సర్క్యూట్‌తో కాలిపోయిన వస్తువులు

**సిద్ధిపేట రూరల్, నవంబరు 23, ప్రభాతవార్త :** సిద్ధిపేట పట్టణంలోని 38వ వార్డు పటేల్‌పురకు చెందిన శశికళ అనే మహిళ ఇంటిలో షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చేలరేగిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో స్థానికులు, అగ్నిమాపకసిబ్బంది మంటలను అర్పివేసి అదుపులోకి తెచ్చారు. ఇంటిలోని నిత్యావసర ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయినట్లు బాధితురాలు తెలిపారు. దాదాపు రూ. 3లక్షల ఆస్థినష్టం జరిగినట్లు తెలిపారు. మంటలను అదుపులోకి తేవడంతో ప్రాణనష్టం తప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ఆలయ కమిటీ చైర్మన్‌గా లక్ష్మయ్య

**చౌటకూరు, నవంబరు 23, ప్రభాతవార్త:** మండల పరిధిలోని చక్రియాల గ్రామంలో నిత్యపూజలందుకుంటున్న శ్రీలక్ష్మీ అనంతపద్మనాభస్వామి ఆలయ నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ డైరెక్టర్లుగా నియమితులైన భానూరి లక్ష్మయ్య, మన్నె నర్సింలు, జంగిలి మల్లమ్మ, తిమ్మారెడ్డిగారి అంజిరెడ్డి, రోళ్లపాటి సత్యనారాయణ, ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఆలయ అర్చకులు మహారాజుల రామకృష్ణశర్మలచే దేవాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ రంగారావు ఆలయ మండలంలో నూతనంగా నియమితులైన ఆలయ పాలక వర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు. డైరెక్టర్లు భానూరి లక్ష్మయ్యను అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. నూతనంగా నియమితులైన ఆలయ పాలక వర్గాన్ని కాంగ్రెస్ నాయకులు, స్థానికులు పూలమాలలతో సత్కరించి అభినందించారు. ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామని కమిటి చైర్మన్ భానూరి లక్ష్మయ్య, కమిటీ డైరెక్టర్లు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నత్తి దశరథ్, నాయకులు చిన్నరోళ్లపాటి రాజశేఖర్, మాజీ ఎంపిటిసి సభ్యులు ప్రభు శేఖర్‌రెడ్డి, పండరి, కిరణ్‌గౌడ్, నాయకులు మల్లారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, గణేష్, డీలర్ దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

## రాబోయే రోజులు ప్రాంతీయ పార్టీలదే

**-మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి**

**పాపన్నపేట, నవంబరు 23, ప్రభాతవార్త:** రాబోయే రోజుల్లో ప్రాంతీయ పార్టీలదే హవా కొనసాగుతుందని బిఆర్ఎస్ నాయకులు, మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం శశిధర్‌రెడ్డి విలేఖరులతో మాట్లాడుతూ మహారాష్ట్రలో శివసేన, ఎన్సిపి పార్టీలకు వచ్చిన సీట్లు ఇందుకు నిదర్శనమన్నారు. జార్ఖండ్ రాష్ట్రంలో సైతం ప్రాంతీయ పార్టీ అయిన జార్ఖండ్ ముక్తిమోర్చా పార్టీకి వచ్చిన సీట్లు, ఓట్లను పరిశీలిస్తే ప్రాంతీయ పార్టీలదే హవా కొనసాగుతోందని తెలుస్తోందన్నారు. తెలంగాణలో తక్షణం ఎన్నికలు నిర్వహిస్తే బిఆర్ఎస్‌కు 100కు పైగా సీట్లు తథ్యమన్నారు.

## ప్రతి నిరుపేదకు ప్రభుత్వ సాయం

**దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి శ్రీనివాస్‌రెడ్డి**

**దుబ్బాక, నవంబరు 23, ప్రభాతవార్త:** అర్హులైన ప్రతి నిరుపేదకు పార్టీలకు అతీతంగా రాష్ట్ర ప్రభుత్వం సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందిస్తుందని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం దుబ్బాక పార్టీ కార్యాలయంలో లబ్దిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. మండల పరిధిలో, మున్సిపాలిటీకి చెందిన కారంపూరి వజ్రవ్వకు రూ.22500, దుద్దెడ రాజయ్య రూ.60,000, కంపే భాగ్య రూ.28,500, మెదునూరి మాధవి రూ.27,500, అవధూత నాగరాజం రూ.44000 చొప్పున చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలాంటిదన్నారు. చెక్కులను తమ తమ ఖాతాలలో జమచేసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ పేదలకు అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బాధితుడిని పరామర్శించిన సంఘ ప్రతినిధులు



బాధితుడిని పరామర్శిస్తున్న గీత కార్మికులు

**కొమురవెల్లి, నవంబరు 23, ప్రభాతవార్త:** మండలంలోని మర్రిముచ్చాల గ్రామంలో తాటిచెట్టుపై నుంచి జారిపడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన పుల్లం నర్సింలుగౌడ్ (58) గీత కార్మికుడు గురువారం తాటిచెట్టు ఎక్కి కిందికి దిగుతున్న క్రమంలో ఒక్కసారిగా చేయిజారి కిందిక జారిపడ్డాడు. దీంతో తీవ్ర గాయాలకు గురయ్యాడు. బాధితుడిని వెంటనే తోటి కార్మికులు చికిత్స నిమిత్తం అసుపత్రికి తరలించారు. దీంతో మండల కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షులు తాళ్లపల్లి రాజుగౌడ్ బాధితుడిని పరామర్శించారు. బాధితుడిని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఎక్సగ్రేసియా చెల్లించాలన్నారు. ఆయన వెంట గీత కార్మిక సంఘం ప్రతినిధులు తురాయి నవీన్, నర్సింహులుగౌడ్, కొయ్యడ నరేష్‌గౌడ్, ముత్యం కర్ణాకర్‌గౌడ్, బత్తిని నర్సింహులుగౌడ్, ముత్యం శేఖర్‌గౌడ్, శిఖ శ్రీనివాస్‌గౌడ్, శిఖ బాలయ్యగౌడ్, శిఖ రాజుగౌడ్ తదితరులు ఉన్నారు.

## ప్రహరీ గోడకు రూ.28 లక్షల మంజూరు

**ఎంపి రఘునందన్‌రావును కలిసిన ముదిరాజ్ నాయకులు**



ఎంపి రఘునందన్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

**సిద్ధిపేట అర్బన్, నవంబరు 23, ప్రభాతవార్త :** మండల పరిధిలోని పొన్నాల సమీపంలో ముదిరాజ్ కులస్తులకు గత ప్రభుత్వం కేటాయించిన ఎకరం స్థలంలో ముదిరాజ్ పిల్లలకు సంబంధించిన హాస్టల్ నిర్మించాలన్నా ఆలోచనతో ముందుగా ప్రహరి గోడ నిర్మించడానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ ముదిరాజ్ సంఘం నాయకులు మెదక్ ఎంపి రఘునందన్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకుల బైరి శంకర్ ముదిరాజ్, తుపాకుల బాల్‌రంగంలు మాట్లాడుతూ ప్రహరి గోడ నిర్మాణానికి ఎంపి రఘునందన్‌రావు వెంటనే స్పందించి రూ.28 లక్షల నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. పార్టీలకు అతీతంగా ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చిన రఘునందన్‌రావుకు అందరూ రుణపడి ఉంటారని తెలిపారు. త్వరలోనే నిధులు మంజూరు వస్తాయని నిధులు రాగానే పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ప్రతినిధులు కొన్నె వెంకన్న, మల్యాల కిషన్, జక్కుల సిద్ధిరాములు, ఎదుళ్ల నర్సింలు, బస్వాపూర్ యాదన్న, మాచాపూర్ చంద్రం, బొండ్ల రామస్వామి, తడ్కపల్లి వెంకట్, వెంకటేష్, సుతారి లింగం, వేణుగోపాల్, సుతారి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# మానస్‌పల్లి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

**-మాజీ జడ్పీటిసి, బిఆర్ఎస్ అధ్యక్షులు**



మానస్‌పల్లిలో మరమ్మతులకు నోచుకోని రోడ్డు దృశ్యం

**సిర్గాపూర్, నవంబరు 23, ప్రభాతవార్త:** నియోజకవర్గ కేంద్రమైన నారాయణఖేడ్ నుంచి మండలంలోని మానస్‌పల్లి రోడ్డు గుంతలమయంగా మారినందున మరమ్మత్తు పనులు చేపట్టాలని బిఆర్ఎస్ నియోజవర్గ, మండల, గ్రామ అధ్యక్షులు అంజాగౌడ్, సంజీవరావు, సంజుపాటిల్, మాజీ జడ్పీటిసి సభ్యులు రాథోడ్ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్‌లు డిమాండ్ చేశారు. శనివారం అంజాగౌడ్, సంజీవరావు, సంజుపాటిల్, రవీందర్ నాయక్‌లు మాట్లాడుతూ రోడ్డు నిర్మాణానికి టెండర్ పనులు పూర్తి అయినా నిర్మాణం పనులు ప్రారంభించని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. రోడ్డుకు మరమ్మత్తు పనులు ప్రారంభం కాకపోవడంతో నారాయణఖేడ్ నుంచి ర్యాకల్, తుర్కపల్లి, సిర్గాపూర్, మానసపల్లి తదితర గ్రామాలకు వెళ్లేందుకు ప్రయాణీకులు పాట్లు పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. విద్యాసంస్థలకు వెళ్లే విద్యార్థులు పడుతున్న పాట్లు చెప్పనలవిగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

**అల్లాదుర్గం, నవంబరు 23, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బహిరన్‌దిబ్బ గ్రామానికి చెందిన లేఖి కవిత అనారోగ్యానికి గురికావడంతో మెరుగైన వైద్య చికిత్స అందుకునేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహా 25వేల రూపాయల సిఎంఆర్ఎఫ్ చెక్కును మంజూరు చేయించగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శేషారెడ్డి శనివారం బాధితురాలికి అందచేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షులు శేషారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తోందని గుర్తు చేశారు. కార్యక్రమంలో బహిరన్‌దిబ్బ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోర్మోని ప్రభు, ఏ బసవరాజ్, ఎన్ అశోక్ కుమార్, పి.శ్రీకాంత్, టి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## హలో మాల చలో జింఖానా వాల్‌పోస్టర్



హలో మాల చలో జింఖానా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**నారాయణఖేడ్ టౌన్, నవంబరు 23, ప్రభాతవార్త:** హలో మాల, చలో జింఖానా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాల మహానాడు రిటైర్డ్ ప్రిన్సిపల్ ఉద్యోగుల సంఘం సలహాదారు అనంతయ్య సూచించారు. పట్టణంలోని అంబేద్కర్ భవనంలో శుక్రవారం నిర్వహించిన మాల మహానాడు ఆయా మండలాల నాయకులతో ప్రత్యేకంగా సమావేశం అయి కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి బి.రాజు, మేకల విజయరావు, మల్లేశం, నర్సింగ్‌రావు, భీమసేన మారుతి రాజ్ కుమార్, తుకారం, పండరి తదితరులు పాల్గొన్నారు.

## సత్యసాయిబాబా జయంతి ఉత్సవాలు

**చౌటకూరు, నవంబరు 23, ప్రభాతవార్త:** మండల పరిధిలోని వెండకోల్ గ్రామంలో శనివారం సత్యసాయి బాబా 99వ జయంతి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు పండ్లు, గ్రామంలోని పేద వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. సాయంత్రం గ్రామంలో గ్రామస్థులు సత్యసాయి బాబా విగ్రహాన్ని అందంగా అలంకరించిన వాహనంలో ప్రతిష్ఠించుకుని శోభాయాత్ర నిర్వహించారు.

## మనూర్‌లో ముగిసిన దర్గా ఉత్సవాలు



మనూర్‌లో దర్గా ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

**మనూర్, నవంబరు 23, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన మనూర్‌లో కొనసాగుతున్న హజరత్ సయ్యద్ షాదుల్లా దర్గా ఉత్సవాలు శనివారంతో ఘనంగా మునిసాయి. గ్రామంలో రెండు రోజుల పాటు కొనసాగిన ఉత్సవాలకు గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పాల్గొని దర్గాను దర్శించుకుని ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ముగింపును పురస్కరించుకుని ఉత్సవాలకు హాజరైన భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందచేశారు.

## మాలల సింహగర్జన మహాసభ

**జిల్లా కన్వీనర్ గుడిమల్ల సత్తయ్య**



మాలల సింహగర్జన సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

**కొండపాక, నవంబరు 23, ప్రభాతవార్త:** డిసెంబర్ 1న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే మాలల సింహగర్జన మహాసభను విజయవంతం చేయాలని ఎస్సి రిజర్వేషన్ వ్యతిరేక పోరాట కమిటీ జిల్లా కన్వీనర్ గుడిమల్ల సత్తయ్య, జిల్లా అధ్యక్షుడు జంజీరపు ఎల్లేష్ కోరారు. శనివారం కొండపాక మండల కేంద్రంతోపాటు, సిర్సనగండ్ల, కుకునూరుపల్లి మండలంలోని రాయవరం గ్రామంలో సింహగర్జన సభ వాల్ పోస్టర్లను అవిష్కరించారు. అనంతరం ఎస్సిలకు రిజర్వేషన్ శాతం పెంచాలని, వర్గీకరణ ప్రక్రియను వెంటనే ప్రభుత్వం నిలిపి వేయాలని, దళిత బంధు లబ్దిదారులను కులాల వారీగా ఎంపిక చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో పెండింగ్‌లో ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ వల్ల మాలలకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మేడిపల్లి బాగయ్య, అరుట్ల నర్సింలు, జంజీరపు మల్లేష్, అరుట్ల చంద్రయ్య, రాజు, ఎడబాట్ల రాజు, గుర్రం మహేందర్, వంశీ, ముల్క మల్లేష్, పేర్క మల్లేష్, మల్లవ్వ, సిరిత, అండాళమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి స్కిల్స్ నేర్చుకోవాలి



మోడల్ స్కూల్ లైఫ్ స్కిల్స్ పుస్తకాలను అందిస్తున్న దృశ్యం

**కొండపాక, నవంబరు 23, ప్రభాతవార్త:** ప్రతి ఒక్క విద్యార్థి స్కిల్స్ నేర్చుకొని ఉన్నతంగా జీవించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతుల నరేందర్ అన్నారు. శనివారం మిషన్ కమ్యూనికేషన్ కార్యక్రమంలో భాగంగా లీడ్ లైఫ్ హ్యాపీలీ సంస్థ ద్వారా తెలంగాణ మోడల్ స్కూల్‌లో లైఫ్ స్కిల్స్ వితౌట్ లైఫ్ స్కిల్స్ పుస్తకాలను విద్యార్థులకు అందించారు. అ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో, చిన్న చిన్న పట్టణాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు స్కిల్స్ నేర్చుకోవడానికి లైఫ్ స్కిల్స్ ఎంతో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు లైఫ్ స్కిల్స్ నేర్చుకోవడానికే ఈ పుస్తకాలు అందించడం జరిగిందని తెలిపారు. ప్రస్తుత కాలంలో స్కిల్స్ లేకుంటే ఎక్కడ ఉద్యోగ అవకాశాలు లభించడంలేదన్నారు. స్కిల్స్ నేర్చుకొని ప్రతి విద్యార్థి జీవితంలో ఎదగాలని అయన కోరారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, మిషన్ కమ్యూనికేషన్ కోఆర్డినేటర్ రమేష్, పెద్దంకుల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.